సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 4 । జనవరి । 2023



క్రికెట్‌లో కొట్టుకున్న విద్యార్థులు
క్రమశిక్షణతో మెలగాల్సిన విద్యార్థులు విచక్షణ మరచి రోడ్లపై ఒకరిపై ఒకరు బ్యాట్లు, ఇనుపరాడ్లతో కొట్టుకున్న ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. - 8లో



ఉత్సాహంగా బండలాగుడు పోటీలు
నందలూరు మండలం టంగుటూరులో హజరత్ ఖాదర్‌వల్లీ సాహెబ్ ఉరుసు సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.160
రెండోరకం	రూ.70	రూ.108



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 96 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



ఈ రోజు మార్కెట్‌కు పట్టు గూళ్లు రాలేదు.

ముగ్గురికి జిల్లా బహిష్కరణ

- ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- సారా తయారీ, విక్రయాల కేసుల్లో నిందితులు
- వీరిలో ఒకరు మహిళ



బహిష్కరణకు గురైన మహిళ

మదనపల్లె : నాటుసారా తయారీ, విక్రయాలు జరుపుతూ పట్టుబడిన ఒక మహిళ, ఇద్దరు పురుషులకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ రెండు నెలల పాటు జిల్లా బహిష్కరణ విధించారు. ఈమేరకు మంగళవారం మదనపల్లె ఎస్‌ఈబీ కార్యాలయానికి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఉత్తర్వులు అందాయి. వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ మాట్లాడుతూ..పట్టణంలోని బాబూకాలనీకి చెందిన శ్రీరాములునాయక్ భార్య బుక్కేసాలమ్మ(55) నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తుండేదన్నారు. పలుమార్లు ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడినప్పటికీ ఆమెలో ఏమాత్రం మార్పు కనిపించకపోగా, ఆరునెలల వ్యవధిలో మూడుసార్లు అరెస్ట్ అయిందన్నారు. ఎస్‌ఈబీ సీఐ మురళీకిషోర్ మాట్లాడుతూ.. మదనపల్లె మండలం కొండమీదచెరువు తాండాకు చెందిన కె.చంద్రానాయక్, వడిత్యా భాస్కర్‌నాయక్‌లు ఆరు నెలల వ్యవధిలో నాటుసారా తయారీ, రవాణా విక్రయాలు చేస్తూ ఇద్దరు చెరో మూడు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వన్‌టౌన్ పోలీసులు మహిళ బుక్కే సాలమ్మను, ఎస్‌ఈబీ పోలీసులు చంద్రా నాయక్, వడిత్యాభాస్కర్‌నాయక్‌లను గూండా యాక్ట్ కింద గతనెల 26న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఎదుట వ్యక్తిగతంగా హాజరుపరిచారు. దీనిపై విచారించిన జిల్లా కలెక్టర్ ఏపీ సామాజిక, ప్రమాదకర కార్యకలాపాల నిరోధకచట్టం -1980, సెక్షన్ 3(3) కింద నిందితులు ముగ్గురికి రెండునెలలపాటు జిల్లా బహిష్కరణ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అయితే రాష్ట్రంలో సారా కేసులకు సంబంధించి మహిళకు జిల్లా బహిష్కరణ విధించడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది.

7020 మంది లబ్ధిదారులకు
కొత్త వైఎస్‌ఆర్ పింఛన్ కానుక

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో వైఎస్‌ఆర్ పింఛన్ కానుక కింద 7020 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లు మంజూరు చేశామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్‌ఆర్ పింఛన్ కానుక కింద 62 లక్షల మంది లబ్ధిదారులకు 1,786,41 కోట్ల రూపాయలు నేరుగా నగదు పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు వీక్షించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు 2,18,101 మందికి గాను రూ.6.51 కోట్లు అందజేశామన్నారు. సామాజిక భద్రత పింఛన్ దారులకు సీఎం జగన్ నూతన సంవత్సర కానుకగా పింఛన్ పెంపుదల చేశారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పింఛన్‌దారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు.



పెన్షన్ లబ్ధిదారురాలికి నూతన కార్డును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

చిన్నమండెం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లె, మల్లూరు గ్రామ సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇళ్లు ఉండాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎంపీడీఓలు కూడా తమ పరిధిలో సమీక్షలు నిర్వహించి ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన వలంటీర్ల చేత ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ పూర్తి చేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం సచివాలయంలో సిబ్బంది హాజరుపట్టిక, ఉద్యోగుల మూవ్‌మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, వైఎస్‌ఆర్ పింఛన్ కానుక, జగనన్న అమ్మ ఒడి, రైతు భరోసా వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితా, ఎస్‌ఎల్‌ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది పనితీరుపై అక్కడి ప్రజలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ దివ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది నిమిషాల్లోగా అంబులెన్స్ చేరుకోవాలి

రాయచోటి : అత్యవసరం, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి 24 గంటలు ఉచిత అంబులెన్స్ సేవలు అందించాలని, ఫోన్ చేసిన పది నిమిషాల్లోగా అంబులెన్స్ చేరుకోవాలని సంబంధిత వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి 108, 104 అంబులెన్స్ సేవలు, వాహనాల పనితీరు తదితర అంశాలపై సంబంధిత వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 108 అంబులెన్స్ వాహనాలు 32 ఉన్నాయని, అలాగే 104 వాహనాలు 30, 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 14 ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని అన్ని వాహనాల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డీసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్, 108, 104 కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాయిస్ మెసేజ్‌తో గర్భిణులకు సలహాలు

రాయచోటి అర్బన్ : మాతాశిశు సంరక్షణలో భాగంగా గర్భిణులకు వైద్య సలహాలు అందించేందుకు కిల్కారీ మొబైల్ అప్లికేషన్ ద్వారా వాయిస్ మెసేజ్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్నట్లు డీఎంహెచ్‌ఓ కొండయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని గర్భం దాల్చిన మహిళల వివరాలు, ఫోన్ నంబరు సేకరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గర్భిణికి 4వ నెల వచ్చినప్పటి నుంచి ప్రసవం అయిన ఒక సంవత్సరం వరకు వారానికొకసారి 01244588000 నంబరు నుంచి ఒకటిన్నర నిమిషాల పాటు వాయిస్ మెసేజ్ వస్తుందన్నారు. మాతాశిశు ఆరోగ్య సేవలు, పౌష్టికాహారం, వ్యాధినిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ సేవలు తదితరాలపై డాక్టర్ అనితచే ప్రీరికార్డెడ్ వాయిస్ మెసేజ్ రూపంలో సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. ఏదైనా కారణంతో వాయిస్ మెసేజ్ వినలేకపోయిన వారు 14423 నంబరుకు కాల్ చేస్తే వాట్సాప్ మెసేజ్ ద్వారా వినడానికి కూడా అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సభ్యులతో గొడవపడి యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మదనపల్లెలో మంగళవారం జరిగింది. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన వెంకటరమణ కుమారుడు ఆర్.సతీష్‌కుమార్ (22) కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపంతో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్‌లో కొట్టుకున్న విద్యార్థులు

- వీధి రౌడీల్లా ప్రవర్తించిన వైనం
- జెడ్పీ హైస్కూల్ ఎదుట బ్యాట్లతో దాడి
- రోడ్డుపై తరుముకుంటూ వీరంగం


నడిరోడ్డుపై బ్యాట్‌తో విద్యార్థిని చితకబాదుతున్న దృశ్యం


జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో కిందపడేసి కాలుతో తన్నుతున్న విద్యార్థులు

మదనపల్లె : చదువులమ్మ ఒడిలో విద్యాబుద్ధులు నేర్చుకుని క్రమశిక్షణ కలిగిన పౌరుల్లా మెలగాల్సిన విద్యార్థులు విచక్షణ మరచి రోడ్లపై ఒకరిపై ఒకరు బ్యాట్లతో, ఇనుపరాడ్లతో కొట్టుకున్న ఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. జెడ్పీ హైస్కూల్ ఎదురుగా సాయంత్రం 4.40 గంటల ప్రాంతంలో కొందరు విద్యార్థులు గుంపుగా చేరి ఒకరిపై ఒకరు గొడవకు దిగారు. ఇష్టం వచ్చినట్లుగా కిందపడేసి తన్నుతూ, బ్యాట్లతో దాడి చేస్తూ నడిరోడ్డుపై వీరంగం సృష్టించారు. రోడ్డు మీద వెళుతున్న ప్రజలు వద్దని వారిస్తున్నా.. ఏమాత్రం పట్టించుకోకుండా కిందపడిన విద్యార్థి ప్రాణభయంతో జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లోకి పరిగెత్తినా.. ఛేజింగ్ చేస్తూ పాఠశాలలోకి వెళ్లి తన్నుతూ, కిందపడేసి కొట్టడం కనిపించింది. గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు, రోడ్డుమీద వెళుతున్న ప్రజలు వారించి గట్టిగా మందలించడంతో వెనక్కు తగ్గి వెళ్లిపోయారు. ఈ తతంగాన్ని వీడియోలో చిత్రీకరించిన కొందరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కాలేజీ యూనిఫాంలో విద్యార్థులు గొడవపడిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరారు. టూటౌన్ ఎస్‌ఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల పరస్పర దాడిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేస్తున్నామని చెప్పారు.

ఎట్టకేలకు కన్నబిడ్డ చెంతకు వృద్ధురాలు

- చొరవ తీసుకున్న వలంటీర్
- మున్సిపల్, పోలీస్ అధికారుల జోక్యం
- కుటుంబీకులకు కౌన్సెలింగ్‌తోపాటు హెచ్చరికలు


వృద్ధురాలి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మున్సిపల్ ఆర్‌ఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు

రాయచోటి అర్బన్ : తల్లిని రోడ్డుపైన వదిలేసిన బిడ్డల వద్దకు తిరిగి చేర్చారు రాయచోటి మున్సిపల్, పోలీసు అధికారులు. వివరాలలోకి వెళితే.. పట్టణంలోని భట్టువీధిలో మరియంబీ (75) అనే వృద్ధురాలు చలికి వణుకుతూ రోడ్డుపై ఉండడాన్ని వలంటీర్ నీలిమ గమనించింది. సమాచారాన్ని మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జునకు అందించింది. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన వృద్ధురాలి కుటుంబీకుల గురించి ఆరా తీశారు. మరియంబీ కుమారులు ఒకరు పింఛా గ్రామంలో, మరొకరు పట్టణ శివారులోని రాయుడు కాలనీలో ఉన్నారంటూ ఇరుగుపొరుగు వారి నుంచి తెలుసుకున్నారు. కుటుంబీకుల నిరాదరణ కారణంగా మరియంబీ తనకు అందే వృద్ధాప్య పింఛనుతో ఒక చిన్నగదిలో అద్దెకు ఉంటూ ఇరుగు పొరుగు వారు పెట్టేది తింటూ కాలం గడిపేది. వయో భారంతో మల,మూత్రాలు అక్కడే విసర్జిస్తుండటంతో యజమానులు ఆమెను గది నుంచి వెళ్లగొట్టారు. సోమవారం రాత్రికి ఆమెను ఒక గదిలో ఉంచిన మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున ఉదయాన్నే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుధాకరరెడ్డి ఆదేశాలతో ఎస్‌ఐ నరసింహారెడ్డి, ఏఎస్‌ఐలు సర్దార్, పురుషోత్తం నాయక్‌తో కలిసి ఆర్‌ఐ మల్లికార్జున రాయుడుకాలనీలో ఉంటున్న వృద్ధురాలి కుమారుడు, కుటుంబీకులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోమారు ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవంటూ గట్టిగా హెచ్చరించారు. దీంతో వృద్ధురాలు చివరకు కుమారుడి ఇంటికి చేరి అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది. వృద్ధురాలిని ఆమె కుటుంబీకుల వద్దకు చేర్చేందుకు మున్సిపల్ ఆర్‌ఐ, పోలీసు అధికారులు చూపిన చొరవకు స్థానికులు అభినందనలు తెలిపారు.

రైతులను రాజకీయాల్లోకి లాగొద్దు

- ఈనాడు పత్రికను ఉద్దేశించి బాధిత రైతు ఆవేదన
- ఎమ్మెల్యే బినామీ అంటూ పేర్కొనడంపై మనస్తాపం



మాట్లాడుతున్న రైతు నారాయణరెడ్డి

మదనపల్లె : పూర్వీకుల నుంచి వ్యవసాయమే జీవనాధారంగా, చుట్టుపక్కల గ్రామాల్లో మేటిరైతుగా పేరొందిన తమను కుట్రపూరిత రాజకీయాల్లోకి లాగడమే కాకుండా, వార్తలో తమపేర్లను ప్రస్తావించడంపై తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోటకు చెందిన రైతు నారాయణరెడ్డి ధ్వజమెత్తారు. 'అక్రమాలకు ద్వారం తెరిచారు' శీర్షికన సోమవారం ఈనాడు పత్రికలో ప్రచురితమైన కథనం పూర్తి అవాస్తవమని, వార్తలో పేర్కొన్న విధంగా తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి, తమకు సంబంధం లేదన్నారు. మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనవసర వివాదాల్లోకి తమను లాగి వృద్ధాప్యంలో ఇబ్బందులు పెట్టవద్దని వేడుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోటకు చెందిన నారాయణరెడ్డి, అదే గ్రామానికి చెందిన కృష్ణమూర్తి, ప్రసాద్‌కు పక్కపక్కనే పొలాలున్నాయని తెలిపారు. వీరిమధ్య ఇటీవల పొలంగట్టుకు సంబంధించి వివాదం జరిగిందన్నారు. దీనిపై పరస్పరం కేసులు పెట్టుకోవడంతో ఎఫ్‌ఐఆర్ నమోదైందన్నారు. చార్జ్‌షీట్ దాఖలై బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఇదిలా ఉంటే ఇటీవల తంబళ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు కొండ్రెడ్డి గ్రామంలోని 0.70 సెంట్ల భూమికి సంబంధం లేని వ్యక్తుల దగ్గర నుంచి కొనుగోలు చేసినట్లు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఇబ్బందులు పెట్టాలని చూశాడన్నారు. తాము విషయం తెలుసుకుని వ్యతిరేకించడంతో టీడీపీ నాయకుడు కొండ్రెడ్డి తనకు అనుకూలమైన పత్రికలో రాజకీయంగా తన ప్రతిష్టను పెంచుకునేందుకు తమపై తప్పుడు కథనాలు రాయించాడన్నారు. ఈనాడు వార్తలో పేర్కొన్న విధంగా కృష్ణమూర్తిని తాము భూమి అమ్మాలని కోరలేదని, 1985 నుంచి తమకు అక్కడ భూములుంటే, 2017లో తంబళ్లపల్లె నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. తమను ఎమ్మెల్యే బినామీగా పేర్కొనడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా గడచిపోతున్న తమ జీవనాన్ని పది మందిలోకి లాగి రాజకీయరంగు పులమడంపై ఈనాడు పత్రికపై పరువునష్టం దావా వేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో రైతులు బలరామిరెడ్డి, గోవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

ఐదుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

పోరుమామిళ్ల : పట్టణంలోని పాత పోస్టాఫీసు వీధిలో మంగళవారం గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, మరో నలుగురు స్వల్ప గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన రజియాబీ (50) పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓ చిన్న రూమ్‌లో రజియాబీ దుకాణం ఏర్పాటు చేసి, టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవనం సాగించేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రూమ్ తెరవగా గ్యాస్ వాసన వస్తుండటంతో.. భర్తకు ఫోన్ చేసి సిలిండర్ లీక్ అయి గ్యాస్ అంతా అయిపోయినట్టుంది, ఇంటి నుంచి మరో సిలిండర్ తీసుకురావాలని చెప్పింది. ఆయన వచ్చే దాకా ఆగకుండా లైటర్‌తో స్టౌ వెలిగించేందుకు ప్రయత్నించగా.. రూము నిండా ఉన్న గ్యాస్ వల్ల పెద్దగా మంటలు లేచి ఆమెను చుట్టుముట్టాయి. ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టడంతో ఆమె భయంతో గట్టిగా కేకలు వేసింది. సిల్క్‌చీర కావడంతో మంటలతో చీర శరీరానికి అతుక్కుపోయింది. ఆమె కేకలతో పక్కనే ఉన్న జమాల్‌బీ (49), అబ్దుల్‌అజీజ్(9) అక్కడికి వెళ్లడంతో మంటలు తగిలి వారూ గాయపడ్డారు. అదే సమయంలో వీధిలో వాకింగ్ చేస్తున్న రహమత్‌బీ, రహీంబీ అనే మహిళలు కేకలు వినపడి రూము నుంచి పొగలు వస్తుండటంతో.. అక్కడికి వెళ్లారు. లోపలి నుంచి మంటలు ఒక్కసారిగా వారిపైకి దూసుకు రావడంతో వారూ కేకలు వేస్తూ రోడ్డుపైకి పరుగెత్తారు. వారిద్దరూ గాయపడ్డారు. అందరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు పంపించారు. రజియాబీ శరీరం బాగా కలడంతో ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

ఎలుగుబంటి దాడి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వెంకటయ్య అనే వ్యక్తి మంగళవారం ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటయ్య గడ్డి కోసం సమీపంలోని కొండకు వెళ్లగా.. అక్కడ ఎలుగుబంటి దాడికి గురయ్యాడు. వెంటనే అప్రమత్తమై ఎలుగుబంటి నుంచి తప్పించుకుని గాయాలతో ఇంటికి చేరుకున్నాడు. హుటాహుటిన వైద్యపరీక్షల నిమిత్తం కుటుంబ సభ్యులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల వరుస బదిలీలకు బ్రేక్!

ఎట్టకేలకు ఎంవీఐ నియామకం


బాధ్యతలు చేపట్టిన ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటకు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల వరుస బదిలీల పరంపరకు బ్రేక్ పడింది. గతేడాది చివరిలో మూడు నెలల్లో నలుగురు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు వరుసగా మార్చి, మార్చి బదిలీ అవుతూ వచ్చారు. దీంతో నవంబరు 14న 'బ్రేక్ లేని ఇన్‌స్పెక్టర్లు' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనం రవాణా శాఖలో చర్చనీయాంశంగా మారింది. పర్మినెంట్‌గా ఒకరు లేకపోవడంతో రవాణా శాఖ పరంగా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గందరగోళానికి తెరపడేలా రెగ్యులర్ ఎంవీఐ నియామకం చేపట్టింది.

బాధ్యతలు స్వీకరించిన వినోద్ కుమార్

ఎట్టకేలకు రాజంపేటకు ఎంవీఐను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పని చేస్తున్న ఎంవీఐ అనిల్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో బి.వినోద్‌కుమార్‌ను ఎంవీఐగా నియమించింది. ఆయన తిరుపతి జిల్లాలోని రేణిగుంట చెక్‌పోస్టు ఏఎంవీఐగా పని చేశారు. అక్కడి నుంచి పదోన్నతిగా రాజంపేట ఎంవీఐగా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఎంవీఐగా బి.వినోద్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖపరంగా మెరుగైన సేవలందిస్తానని పేర్కొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు(రాజంపేట) : టంగుటూరులో శ్రీ హజరత్ ఖాదర్‌వల్లీ సాహెబ్ వారి 46 ఉరుసు ఉత్సవాలలో భాగంగా జెడ్పీ హైస్కూల్ మైదానంలో బండలాగుడు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు, ముస్లింలు ఐకమత్యంగా ఉత్సవాలు నిర్వహించుకోవడం మతసామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. అంతకుముందు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, మైనార్టీ నాయకుడు షావల్లి, తాజుద్దీన్, మహమ్మద్‌గౌస్, అహ్మద్‌అలీ, గౌస్‌పీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సడివీధి సుధాకర్, అన్నం నాగేంద్ర, ఆంజనేయులు, కుందా నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, పాలగిరి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి (రూ.50 వేల)ని నందలూరుకు చెందిన షేక్‌హబీబుల్లా, రెండవ బహుమతి (రూ.40 వేల)ని కాశినాయనకు చెందిన జగన్‌మోహన్‌రెడ్డి, మూడవ బహుమతి (రూ.30 వేల)ని కలసపాడుకు చెందిన జయన్న, నాల్గవ బహుమతి(రూ.10వేల)ని రాజంపేట మండలం తాళ్లపాకకు చెందిన సుబ్బరాజు కైవసం చేసుకున్నారు. కాగా మొదటి బహుమతి రూ.50 వేలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అందజేశారు.

సావిత్రిబాయి పూలే అవార్డు ప్రదానం


గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నుంచి అవార్డు అందుకుంటున్న రెడ్డెమ్మ

కేవీపల్లె : ద గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా కేవీపల్లె మండలం జిల్లేళ్లమంద పంచాయతీ పాళెంగడ్డ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బి.రెడ్డెమ్మ సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. మహాత్మాజ్యోతిరావు పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని అవార్డులు ప్రదానం చేశారు. సేవాదృక్పథం, సమాజ సేవకు గానూ ఉపాధ్యాయిని బి. రెడ్డెమ్మను ఎంపిక చేశారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా రెడ్డెమ్మకు అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న రెడ్డెమ్మను ఎంఈవో రెడ్డిబాషా, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడ్డ నాగులు


కలకడ : లారీ ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ అగ్రహారంలో జరిగింది. బాధితుడి బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నడిమిచెర్ల పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన సి.నాగులు గ్రామంలోని వీధిలో ఉండగా ఇటుకల లోడుతో గ్రామానికి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగులు కాలు విరిగి, శరీరంపై గాయాలు అయ్యాయి. బాధితుడిని కలకడ 108 సిబ్బంది శ్రీనివాసులు, వెంకటాచలపతి ప్రథమ చికిత్స కోసం కలకడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో..

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లెలో మంగళవారం జరిగింది. చిత్తూరుకు చెందిన కళ్యాణ్(27) సొంత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చాడు. కదిరిరోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వెళుతుండగా మరో ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో కళ్యాణ్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు


అఫ్రాన్ భాను (ఫైల్),


అయాన్ (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని జమాల్‌పల్లికి చెందిన అఫ్రాన్‌భాను (24), ఆమె కుమారుడు అయాన్ (3) కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటికి చెందిన అఫ్రాన్ భానుకు సీకేదిన్నె మండలం జమాల్‌పల్లికి చెందిన ఇక్బాల్ బాషాకు 5 ఏళ్ల క్రితం వివాహం అయింది. మంగళవారం అఫ్రాన్ భానుతోపాటు తన కుమారుడు అయాన్‌ను బస్సు ఎక్కించానని ఇక్బాల్ బాషా తెలిపాడు. రాయచోటిలోని అత్తవారి ఇంటికి ఫోన్ చేసి ఇంటికి తీసుకువెళ్లాలని చెప్పానని ఆయన పేర్కొన్నాడు. అఫ్రాన్ భాను, అయాన్‌లు ఎంత సేపటికీ రాయచోటికి రాకపోవడంతో అఫ్రాన్ భాను అక్క యాసీన్ భాను ఇక్బాల్ బాషాకు ఫోన్ చేసింది. అతను పొంతన లేని సమాధానాలు చెబుతుండటంతో వారికి అనుమానం వచ్చి సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.